# మహిళా ఉద్యమ చైతన్యం మహిళా దినోత్సవం

**అర్ధవలస,** అర్థఫ్యూడల్ వ్యవస్థలున్న దేశాలలో స్త్రీల సమస్యలు ప్రధానంగా వాటికి సంబంధం లేనివిగా వుండవు. ఇటువంటి దేశాలలో ప్రధాన కర్తవ్యం, కీలక కర్తవ్యం, భూస్వామ్య విధానాన్ని కూలద్రోసే వ్యవసాయక విప్లవ కర్తవ్యమే. ఈ విప్లవం–కేవలం భూస్వామ్య విధానాన్ని మాత్రమే కాదు; ఏ సామ్రాజ్యవాద శక్తులకు భూస్వామ్య విధానం సాంఘిక పునాదిగా వుందో ఆ సామ్రాజ్యవాద పెత్తనాన్ని, ఆధిక్యతను కూడా నాశనం చేస్తుంది. అయితే భారతదేశ విప్లవోద్యమ కర్తవ్యాలలో నేడు వ్యవసాయక విప్లవ కర్తవ్యమే కీలకమైంది.

వ్యవసాయ విప్లవంయొక్క ఉన్నతస్థాయి ఎలా వుంటుందో హూనాన్ రైతు ఉద్యమ పరిశీలనా నివేదిక మనకు తెలియచెబుతున్నది. పాత వ్యవస్థలపైన–దాని అర్థఫ్యూడల్, అర్థవలస లక్షణాల స్థానంలో ఒక నూతన వ్యవస్థకు, దానికి సంబంధించిన నూతన విలువలకు–దాని ఆర్థిక, రాజకీయ, సైనిక, సాంస్కృతిక విభాగాలన్నింటా నూతన బీజాలు నాటింది హూనాన్ రైతువిప్లవం. ఈ నూతన విలువలు పాత వాటికి భిన్నమైనవేగానీ, అవి పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద విలువలు కాదు; ఆ దేశాలలో అమలులో వున్న హీనవిలువలూ, దోపిడీ విలువలూ కాదు; అభివృద్ధి చెందుతూ వున్న దేశాలకు (వెనుకబడిన దేశాలకు) అవి ఎగుమతి చేస్తున్న వలసవాద సంస్కృతీ కాదు; అదే సందర్భంలో నాటి సోవియట్ రష్యాలో అమలులో వున్నట్టి సోషలిస్టు విప్లవ సాంస్కృతిక విలువలను తక్షణమే యాంత్రికంగా స్వీకరించడమూ కాదు. పైవి రెండూ అభివృద్ధిచెందిన రెండు భిన్న ఆర్థిక, రాజకీయ, సాంఘిక వ్యవస్థలకు చెందిన భిన్నమైన, ఒక దానితో ఒకటి పొసగని విలువలు. అభివృద్ధి చెందుతూ వున్నదేశాల ప్రజలు, విప్లవోద్యమం యీ భిన్నమైన రెండు విలువలలో ఎటువేపు అంటే ఖచ్చితంగా సోషలిస్టు విప్లవ విలువలవైపే. పాత కంటే ఏదైనా మంచిదనే విచక్షణాజ్ఞానరహితంగా విప్లవకారులుండరు. భారత అర్థఫ్యూడల్, అర్థవలస వ్యవస్థను కూలద్రోయడం, నూతన ప్రజాతంత్ర వ్యవస్థ స్థాపన భారత విప్లవకారుల లక్ష్యం. ఈ లక్ష్యానికనుగుణమైన నూతన ప్రజాస్వామిక విప్లవ విలువలే నేటి విలువలుగా వుండగలుగుతాయి. నూతన ప్రజాస్వామ్య ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విలువలకోసం పోరాటం సాగిస్తూ, నెలకొల్పుకుంటూ సోషలిస్టు విప్లవ విలువలకోసం ఘర్షణపడుతూ, అంతిమంగా కమ్యూనిస్టు విలువలు సాధించే లక్ష్యంతో కమ్యూనిస్టు విప్లవకారులు కృషిచేస్తారు.

మన ప్రయాణం నూతనత్వంవైపు, ప్రగతిశీలంవైపు, నవచైతన్యంవైపు అంటున్నామంటే ప్రస్తుతం అమలులో వున్న ఫ్యూడల్, సాంప్రదాయక పద్ధతికి వ్యతిరేక దిశవైపు. అంటే దీనికి భిన్నంగా రంగురంగుల సామ్రాజ్యవాద వికృత సంస్కృతివైపు కాదు. దాని ఆర్థిక, రాజకీయ విధానాలవైపూ కాదు. అలాగే ఫ్యూడల్, సామ్రాజ్యవాద పద్ధతులు రెండింటికీ భిన్నమైనవైపు అంటున్నామంటే తక్షణమే సోషలిస్టు సంస్కృతిని యాంత్రికంగా వున్నపళంగా అమలుజరుపడమూకాదు. నూతన ప్రజాతంత్ర సాంస్కృతిక విలువలు మాత్రమే నేటి దశలో మనం నెలకొల్పగలుగుతాం. అవి మాత్రమే ప్రస్తుతం విప్లవాత్మకమయినవి. మనం గెంతు వేయడానికి ప్రయత్నించినా ఫలితం శూన్యం. కనుక రెండింటినీ గందరగోళ పరచకూడదు. సామ్రాజ్యవాద భావజాలమూ, సంస్కృతే గొప్పదిగా భావించి అదే సోషలిజమనీ, అదే స్వేచ్ఛ అనీ భ్రమలకు లోను కారాదు. నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం ఆలస్యంకావడం, ఒడుదుడుకులకు గురికావడం మూలంగా కొంతమంది బూర్జువావర్గ మేధావులు సోషలిజంపైన, కమ్యూనిజంపైన దాడి చేస్తున్నారు. వారక్కడే ఆగలేదు. నూతన ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాలు అసలు పరిగణనలోకే తీసుకోవడం లేదు. వాటిని గందరగోళపరచి ముందుకు చెయ్యి చూపిస్తూ వెనక్కు నడిపించాలని చూస్తున్నారు. ఇలాంటి శక్తులను కనిపెట్టి వుండవలసిన అవసరం నేడెంతైనా వుంది.

స్త్రీవిముక్తి, దళిత విముక్తి, జాతుల విముక్తి, తెగల విముక్తి మొదలైన సమస్యలకోసం సాగించే పోరాటం భూస్వామ్య వ్యతిరేక పోరాటం నుంచి విడదీయలేము. నూతన ప్రజాతంత్ర విప్లవంలో కీలకమైన వ్యవసాయక విప్లవం ద్వారానే పాతపైన (భూస్వామ్యంపై), పాతను సాంఘిక పునాదిగా చేసుకొన్న రంగుల సామ్రాజ్యవాదంపైన దండెత్తగలం. భూస్వామ్య విధానంపైన చావుదెబ్బ కొట్టగల విప్లవ రైతాంగ ఉద్యమం మాత్రమే నూతన సాంస్కృతిక విలువలను నెలకొల్పగలుగుతుంది. ఉన్నతస్థాయికి చేరిన తెలంగాణా రైతాంగ సాయుధ విముక్తి పోరాటం, పెళ్లి, విడాకులు, వితంతు వివాహాలు, స్త్రీ విద్య తదితర విషయాలలో పాత సాంప్రదాయాలను, కట్టుబాట్లను ఛేదించింది. కుల, మత అడ్డుగోడలను అధిగమించింది. మూడువేల గ్రామాలు ఫ్యూడల్ బంధనాల నుంచి విముక్తి చెందాయి; భూస్వాముల రాజకీయాధికారం చలామణి కాలేదు. భూస్వామ్యవర్గం నగరాలకు పారిపోయింది. అంతేకాదు శ్రీకాకుళం, గోదావరి, ఖమ్మం, వరంగల్, కరీంనగర్ రైతాంగ ఉద్యమాల ప్రభావంతో కూడ స్త్రీలు సాపేక్షికంగా స్వేచ్ఛానువర్తులుగా వున్నారు.

స్త్రీలలో ఉన్నత విద్యావంతుల సంఖ్య సాపేక్షికంగా పెరగడంవలన కొంతశాతం స్వేచ్ఛాను వర్తులుగా వుండడానికి ప్రయత్నించినప్పటికీ; రైతు ఉద్యమ వెల్లువ మాత్రమే భూస్వాముల రాజ్యాధికారాన్ని కూలద్రోసి పురాతన, సాంప్రదాయవాదాన్ని, మూఢాచారాలను కుల, మత, అణచివేతలనూ, స్త్రీలపై పురుషుల పెత్తనాన్ని సవాల్ చేయగలుగుతుంది.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం మహిళల సమస్యలను ఎలుగెత్తి చాటి విముక్తికి బాట చూపేదిగా వుండాలి. ఆయా దేశ, కాల నిర్దిష్ట పరిస్థితికి తగిన కర్తవ్యాలను చేపట్టేదిగా వుండాలి. విభిన్న రాజకీయ, సాంఘిక వ్యవస్థలుగల ప్రపంచంలో ఎన్నో హెచ్చుతగ్గులు, తేడాలు వున్నాయి. ఆయా పరిస్థితులకనుగుణంగా, ఆయా దేశాల విప్లవోద్యమ కర్తవ్యాల వెలుగులో అందులో భాగంగానే స్త్రీ సమస్యకు పరిష్కారం వుంది. భారతదేశ పరిస్థితిలో నూటికి ఎనభైశాతం ఫ్యూడల్ కాడిక్రింద నలుగు తున్నారు. కనుక ప్రధానంగా దాని రద్దుకొరకు రూపొందించుకున్న వ్యవసాయ విప్లవోద్యమ కర్తవ్యాలలో భాగంగానే స్త్రీ విముక్తి సాధ్యమవుతుంది. అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశంలో స్త్రీలు, వెనుకబడిన దేశాల స్త్రీలు మౌలికంగా పురుష దురహంకారం, రాజ్యం, మతం, పెట్టుబడికి సంబంధించిన ఒకే రకపు సమ్యలనెదుర్కొంటున్నారు. సామ్రాజ్యవాద దురాక్రమణలు, యుద్ధాలు తెచ్చిపెట్టిన ఎన్నో ఘోరాలకు బలయ్యేది ముందుగా స్త్రీలే. సామ్రాజ్యవాద యుద్ధానికి వ్యతిరేకంగా కూడా ప్రపంచవ్యాపితంగా స్త్రీలంతా ముక్తకంఠంతో నిలబడాల్సి వుంటుంది. సామ్రాజ్యవాదుల పనుపున అమలుజరుగుతున్న నూతన ఆర్థిక విధానాలకు అన్నివిధాలా బలిఅవుతున్నది మహిళలే. వీటితోపాటు సామ్రాజ్యవాద దోపిడీ సృష్టిస్తున్న పర్యావరణ సమస్యలపైన కూడా పోరాడవలసి వుంది.

అర్థవలస, అర్ధఫ్యూడల్ వ్యవస్థలో స్త్రీలు రైతాంగ, శ్రామిక ఉద్యమాలలో భాగంగా రాజ్యాధికారం, వంశాధికారం, మతాధికారం, పురుషాధికారం అనే నాలుగు అధికారాలకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సి వుంది. వీటితోపాటు అనేక వివక్షలకు వ్యతిరేకంగా ప్రత్యేక ఉద్యమాలు గూడ చేపట్టాల్సి వుంది. లింగ వివక్ష, కులవివక్ష, జాతి వివక్ష, వర్ణ వివక్ష(రంగు), మత వివక్షలకు వ్యతిరేకంగా పోరాడవలసి వుంది. సామాన్య స్త్రీల దృష్టికి రాని, వారికిప్పుడు పట్టని ఇంకా ఎన్నో సమస్యలు నేడు ముందుకొచ్చాయి. లైంగికత గురించి వివిధ దృక్కోణాలున్నాయి. మాతృత్వం గురించి వివిధ దృక్కోణాలున్నాయి. వీటన్నిటిపట్ల మార్క్సిస్టు దృక్కోణం గూడ ఒకటి వుంది.

అంతర్జాతీయ మహిళా వేదికలలో యీ సమస్యలన్నీ చర్చకొచ్చాయి. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యాన ఆయా దేశాల ప్రభుత్వాల అనుమతితో వచ్చిన మహిళల సభ ఒకటి, ప్రభుత్వేతర (ఎన్.జి.ఓ.) సంస్థల ప్రతినిధుల సభ ఒకటి చైనా రాజధాని బీజింగ్‌లో జరిగాయి. ప్రపంచవ్యాపితంగా స్త్రీ జాతి ఎదుర్కొంటున్న అనేక సమస్యలు కుప్పలు మూటలుగట్టి తెచ్చి అక్కడ పోయబడ్డాయి. వీటన్నిటికి పరిష్కారాలు సాధించవలసే వుంది.

అదే సందర్భంలో ప్రపంచవ్యాపితంగా స్త్రీ జాతి ఎదుర్కొంటున్న సమస్యలకు మూలం ఆయా సమాజాలలో ఆధిక్యత నెరపుతున్న, అధికారం చలాయిస్తున్న వ్యవస్థలలోనే వుందనే నగ్నసత్యాన్నీ, చెరిపేయడం సాధ్యంకాని సత్యాన్నీ మాత్రం ఎలుగెత్తి చాటవలసే వుంది. పెట్టుబడి, దాని అత్యున్నత రూపం సామ్రాజ్యవాదం. దీని విభిన్న వికృత రూపాలకు వ్యతిరేకంగా సమస్త ప్రజానీకంలో భాగంగా స్త్రీలు నడుం బిగించవలసి వుంది. భారతదేశం లాంటి దేశంలో అర్థఫ్యూడల్ దోపిడీ, పెత్తనం సాగిస్తున్న భూస్వామ్య వ్యవస్థకు, అర్ధవలస దోపిడీ అధికారం చెలాయిస్తున్న సామ్రాజ్యవాదాలకు వ్యతిరేక పోరాటమే మూలాలకు వ్యతిరేకంగా పోరాడటమవుతుంది. 1910లో కార్లాజెట్కిన్ ప్రకటించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం పిలుపు అదే. ఈ పిలుపులేని మహిళా దినోత్సవాలు అర్థం లేనివే. అది బీజింగ్ కావచ్చు, మాస్కో కావచ్చు, న్యూయార్కు కావచ్చు, ఢిల్లీ కావచ్చు. ఈ సభ లెక్కడ జరిగినా ఈ పిలుపులేని సభలు స్త్రీ విముక్తితో సంబంధంలేని వేడుకలుగా పరిగణించాల్సి వుంటుంది. ఈ పిలుపులేని సంఘాల కార్యక్రమాలు కాలక్షేపం కార్యక్రమాలుగానే పరిగణించవలసి వుంటుంది. స్త్రీలకు సంబంధించిన మిగిలిన ఏ సమస్యలపై పోరాటమైనా దీనికిలోబడి, దీనిలో అంతర్భాగంగా జరగవలసిందే. అప్పుడే నిజంగా స్త్రీలకు విముక్తి.

**(16-3-1996 జనశక్తి సంపాదకీయం పునర్ముద్రితం)**

ooooo